సాక్షి అనకాపల్లి

శనివారం । 10 । జూన్ । 2023



రక్తదాన శిబిరం 8లో

ఇండియన్ కోస్ట్‌గార్డ్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 120 మంది రక్తదానం చేశారు.



ఉపాధి కల్పనే ధ్యేయం 8లో

నర్సీపట్నంలో జరిగిన మెగా జాబ్ మేళా విజయవంతమైంది. మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



స్వల్ప వర్షసూచన

అనకాపల్లి టౌన్: రాగల అయిదు రోజుల్లో రెండు రోజులపాటు స్వల్ప వర్షసూచన ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త కుమారి శుక్రవారం పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

నేడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శేషసాయి రాక

మహారాణిపేట: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి, జస్టిస్ యు.దుర్గాప్రసాద్, రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు తదితరులు ఈనెల 10న విశాఖ వస్తున్నారు. నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. తిరిగి ఆదివారం రాత్రి విజయవాడ వెళ్తారు.

సుంకరమెట్ట రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



సుంకరమెట్ట రహదారిలో మొదలైన పనులు

అనకాపల్లిటౌన్ : జాతీయ రహదారుల సంస్థ అధికారులు స్థానిక సుంకరమెట్ట రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. దీంతో జాతీయ రహదారి నుంచి సుంకరమెట్ట రోడ్డులో గోతులతో ఇన్నాళ్లా ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోంది. ఇందులో భాగంగా ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టింది. అదే యంత్రాంగానికి ఈ రహదారి నిర్మాణ పనులు అప్పగించారు. వాడుక నీరు రోడ్డుపైకి రాకుండా రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'రోప్ స్కిప్పింగ్'లో మెరిసిన మేరీ



మేరీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు, ఇతర అధ్యాపకులు

మురళీనగర్: జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థి సత్తా చాటి పతకాలు సాధించింది. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ముంబయిలో జరిగిన జాతీయ రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్‌లో మెటలర్జికల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్.మేరీ ఈ ఘనత సాధించింది. 17 ఏళ్లలోపు బాలికల 'డబుల్ అండర్ 30 సెకండ్స్'విభాగంలో బంగారు పతకం, 'స్పీడ్ స్ప్రింట్ 30 సెకండ్స్'విభాగంలో వెండి పతకం సాధించింది. పాలిటెక్నిక్ కాలేజీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు, మెటలర్జీ విభాగం హెడ్ డాక్టర్ రత్నకుమార్, జనరల్ విభాగం హెడ్ డాక్టర్ పీఎం భాషా, ఫిజికల్ డైరెక్టర్ అబ్బాస్ బేగ్ ఆమెను అభినందించారు.

కేంద్ర హోం మంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు



బహిరంగ సభ జరిగే రైల్వే గ్రౌండ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

డొండపర్తి : కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ నెల 11న విశాఖలో పర్యటిస్తున్న దృష్ట్యా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నారు. అమిత్‌షా పర్యటించే ప్రాంతాలతో పాటు బహిరంగ సభ వద్ద చేపడుతున్న బందోబస్తు చర్యలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ శుక్రవారం పరిశీలించారు. ఐఎన్ఎస్ డేగ, విమానాశ్రయం, వాల్తేర్ రైల్వే గ్రౌండ్, బస చేసే పోర్టు అతిథి గృహం, వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్ వంటి ప్రాంతాలను సందర్శించి అధికారులకు బందోబస్తుపై ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. బహిరంగ సభకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా, అలాగే కేంద్ర హోం మంత్రి నగర పర్యటన సజావుగా సాగేలా పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ తెలిపారు.

నేటి నుంచి జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు

మహారాణిపేట: అక్రిడేటెడ్ జర్నలిస్టులకు శనివారం నుంచి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కేజీహెచ్ డౌన్‌లోని డాల్ఫిన్ డయాగ్నస్టిక్ సర్వీసెస్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలతో ఉచిత బీమా కార్డుల పంపిణీ జరుగుతుందని వెల్లడించారు.

చండ ప్రచండం



అనకాపల్లి @44.2

- సెగలు కక్కుతున్న భానుడు
- విలవిల్లాడుతున్న జిల్లా ప్రజలు
- మరో మూడు రోజులు కొనసాగనున్న వడగాడ్పులు





నిర్మానుష్యంగా అనకాపల్లి నెహ్రూచౌక్ కూడలి (ఇన్‌సెట్) మండుటెండలో కొంగు కప్పుకొని.., ద్విచక్ర వాహనంపై



సాక్షి, విశాఖపట్నం/అనకాపల్లి టౌన్: రోహిణి కార్తె వెళ్లిపోయినా భానుడు శాంతించడం లేదు. రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు కాస్తాయన్న సామెత ఈ వేసవిలో మరోసారి రుజువైంది. గత నెల 25 నుంచి రోహిణి కార్తె ప్రతాపం మొదలై గురువారంతో ముగిసింది. ఆ తర్వాత మృగశిర కార్తె ప్రవేశించాక చిరుజల్లులు, వర్షాలతో చల్లదనం పరచుకుంటుంది. కానీ ఇప్పటికీ రోహిణి తీవ్రతే కొనసాగుతోంది. అదుపు తప్పుతున్న ఉష్ణోగ్రతలతో ఉమ్మడి విశాఖ జిల్లా అట్టుడికిపోతోంది. కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. తెల్లారగానే మొదలవుతున్న సెగలు సాయంత్రం ఆరేడు గంటలవుతున్నా ఆరడం లేదు. ఇళ్లలో ఫ్యాన్లు గిరగిరా తిరుగుతున్నా తాపం తగ్గడం లేదు. ఏసీలు, కూలర్లు రేయింబవళ్లు ఆగకుండా అలా ఆన్‌లోనే ఉంటున్నాయి. బయట నుంచి వచ్చే వేడిగాలులు, వడగాడ్పులు భయకంపితులను చేస్తూనే ఉన్నాయి. శుక్రవారం ఉమ్మడి విశాఖ జిల్లాలో ఠారెత్తించే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా అనకాపల్లిలో 44.2, అల్లూరి సీతారామరాజు జిల్లా నువ్వులమామిడిలో 44.09, విశాఖ నగరంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఇలా ఈ మూడు జిల్లాల్లో పలుచోట్ల 42 నుంచి 44 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదై జనాన్ని బెంబేలెత్తించాయి. ఇవి సాధారణం కంటే 4 నుంచి 7 డిగ్రీలు అధికమన్న మాట! మరోవైపు రానున్న మూడు రోజులు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.

శుక్రవారం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

ప్రాంతం	ఉష్ణోగ్రత
అనకాపల్లి	44.20
మునగపాక	44.01
కొత్తకోట	43.18
మాడుగుల	43.02

అనకాపల్లిలో గత ఐదు రోజుల ఉష్ణోగ్రతలిలా..

తేదీ	గరిష్టం	కనిష్టం
5	37.8	24.0
6	38.8	27.0
7	40.3	26.0
8	40.8	25.5
9	44.2	29.0

అనకాపల్లి నిర్మానుష్యం

వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పట్టణ ప్రజలు అల్లాడిపోతున్నారు. శుక్రవారం పరిస్థితి మరింత దిగజారింది. ఉదయాన్నే రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. అత్యవసర సమయంలో పనులపై వెళ్లేవారు తప్ప మరెవరూ బయటకు వచ్చేందుకు సాహసించలేదు. నిత్యం రద్దీగా ఉండే నెహ్రూచౌక్ వెలవెలబోయింది. సాయంత్రం 6 గంటల తర్వాతే ఈ కూడలిలో కాస్త జనసంచారం కనిపించింది.

కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేయని ఏసీలు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): విశాఖ నుంచి మహబూబ్ నగర్ బయలుదేరిన కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లో ఏసీలు మొరాయించాయి. దీంతో శుక్రవారం చాలా మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం సాయంత్రం 6.40 గంటలకు కాచిగూడ ఎక్స్‌ప్రెస్ విశాఖనుంచి బయలుదేరింది. థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీలో బోగీలలో ప్రయాణికులు గేటు వద్ద నిల్చుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైలు ప్లాట్‌ఫారం మీద పెట్టిన వెంటనే ఏసీలు ఆన్ చేయాలి.. కానీ శుక్రవారం అలా జరగలేదు. దీనిగురించి రైల్వే సిబ్బంది మాత్రం ఏసీలు ఆన్‌లోనే ఉన్నాయని, రైలు నిలిపి ఉంచినపుడు పవర్ మోటార్లు పనిచేయవన్నారు. రైలు రన్నింగ్ ఉన్నప్పుడు పూర్తి స్థాయిలో ఏసీలు పనిచేస్తాయని బదులిచ్చారు.



ఏసీలు పనిచేయక గేట్ వద్ద నిల్చున్న ప్రయాణికులు

బాక్సింగ్‌లో ప్రతిభ చూపిన అరుణకు సత్కారం

తుమ్మపాల : ఇటీవల కోల్‌కత్తాలో జరిగిన ఏషియన్ చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్, ఇండియన్ ఒపెన్‌చెస్ బాక్సింగ్ వెయిట్ కేటగిరీ 58–62 కిలోల పోటీల్లో గోల్డ్‌మెడల్స్ సాధించిన తారకరామ కాలనీకి చెందిన కోరుకొండ అరుణను జిల్లా బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు మళ్ల సురేంద్ర సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ హరీష్ పాల్గొన్నారు.



అరుణను సత్కరిస్తున్న జిల్లా బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు మళ్ల సురేంద్ర

టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 16 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న టౌన్‌ప్లానింగ్ డీసీపీ

దాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరంలో 16 ఫిర్యాదులు అందాయి. డీసీపీలు నరేంద్రనాథ్ రెడ్డి, కేఎస్ రత్నకుమార్, పద్మజ, ఏసీపీలు, సిబ్బంది, డబ్ల్యూఆర్ఎస్ సిబ్బంది ఫిర్యాదును స్వీకరించారు. జోన్–2 నుంచి ఒకటి, జోన్–4 నుంచి ఒకటి, జోన్–5 నుంచి ఐదు, జోన్–6 నుంచి ఆరు, జోన్–8 నుంచి మూడు ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో భద్రత డొల్ల

- పట్టపగలే 18 నెలల చిన్నారి అపహరణ
- అందరినీ దాటి కిడ్నాపర్లు ఎలా మాయమయ్యారు?
- ఆర్పీఎఫ్ ప్రచార ఆర్భాటమే తప్ప ఫలితాలు శూన్యం

తాటిచెట్లపాలెం (విశాఖ): ఏ1 రైల్వేస్టేషన్లలో విశాఖపట్నం రైల్వేస్టేషన్ ఒకటి. ఎంతో అభివృద్ధి చెందిందని చెబుతున్న ఈ రైల్వేస్టేషన్‌లో భద్రత ఎంత? ఈ ప్రశ్నకు సమాధానం మాత్రం రాదు. కారణం చుట్టూ బార్లా తెరచుకున్న ద్వారాలే. అందుకే నేరస్తులు రైలు మార్గాలను ఎన్నుకుంటున్నారు. రైల్వేస్టేషన్‌లో జరిగిన నేరాలు, దొంగతనాల్లో కేవలం ఒకటి, రెండు శాతమే బయటకొస్తున్నాయి. దొంగతనాలు, గంజాయి, మత్తు పదార్థాల రవాణా, కిడ్నాప్‌లు.. ఇలా ఏది జరిగినా కనిపెట్టే నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి. అప్పుడప్పుడు రైల్వేభద్రతా దళం, గవర్నమెంట్ రైల్వే పోలీసులు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లు తప్పితే.. మిగిలిన సందర్భాల్లో తనిఖీలు చేసే నాథుడే కరువయ్యాడు.

విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి ప్రతి రోజూ సుమారు 110 రైళ్లు ప్రయాణిస్తుంటాయి. రోజుకు కనీసం 50వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎనిమిది ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. ఐదు అధికారిక ప్రవేశ/నిష్క్రమణ మార్గాలు, మరెన్నో అనధికార ప్రవేశ/నిష్క్రమణ మార్గాలు ఉన్నాయి. అటువంటి స్టేషన్‌లో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. గురువారం పట్టపగలే 18 నెలల చిన్నారి అపహరణతో భద్రతలో డొల్లతనం మరోసారి బయటపడింది.



విశాఖ స్టేషన్‌లో 8వ నంబర్ ప్లాట్‌ఫాంపై పార్సిల్ ఆఫీస్ వద్ద గల సీసీ కెమెరా

నిర్లక్ష్యపు నీడన.. నిఘా నేత్రాలు

రైల్వే స్టేషన్‌లో మొత్తం 44 సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిలో 26 కెమెరాలు మాత్రమే పని చేస్తున్నాయి. అవి కూడా అరకొర విజిబిలిటీతోనే.! మిగిలిన 18 కెమెరాలు పనిచేయడం లేదు. ఈ కెమెరాల పరిధిలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. దీనికి ఉదాహరణే గురువారం 8వ నంబర్ ప్లాట్‌ఫాంపై జరిగిన చిన్నారి అపహరణ ఉదంతం. ఈ ప్లాట్‌ఫాంపై పార్సిల్ ఆఫీస్ సమీపంలో 35వ నంబర్ స్తంభం వద్ద సీసీ కెమెరా ఉంది. అలాగే 31వ నంబర్ వద్ద మరో కెమెరా ఉంది. సంఘటన జరిగింది 34వ నంబర్ స్తంభం వద్ద. ఈ రెండు కెమెరాలు చిన్నారి కిడ్నాప్‌ను చిత్రీకరించలేకపోయాయి. స్టేషన్‌లోని మరే కెమెరా లోనూ రికార్డ్ కాలేదు.

ఆర్పీఎఫ్‌ది ప్రచార ఆర్భాటమే..

సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యతలను రైల్వే భద్రతా దళం చూసుకుంటుంది. ఇందుకోసం ప్రత్యేక గది, సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. స్టేషన్‌లో కెమెరాలు పని చేయనప్పటికీ.. ఇన్నాళ్లూ సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. అలాగే ఆర్పీఎఫ్ సిబ్బంది కోసం ప్రత్యేకంగా కెమెరాలు కూడా కొనుగోలు చేశారు. వీటిని ధరించిన సిబ్బంది 24 గంటలూ స్టేషన్‌లోని ఎనిమిది ప్లాట్‌ఫాంలపై కలియ తిరుగుతూ ప్రతీ ఒక్కరి కదలికలను గమనించాలి. ఇలా కూడా జరగడం లేదు. ఇక ప్రవేశ/నిష్క్రమణ మార్గాల వద్ద కనీసం భద్రత చర్యలు పాటించడం లేదు. ఇక్కడ సిబ్బంది కానరారు. ఫలానా రైలులో పోగొట్టుకున్న మొబైల్‌ను ప్రయాణికుడికి అప్పగించాం.. ప్రయాణికులు మరచిపోయిన బ్యాగ్‌లను తిరిగి వారి వద్దకు చేరవేశాం.. ఇలాంటి సంఘటనల్లో ఆర్పీఎఫ్ సిబ్బంది ఎంతో ఆర్భాటం చేస్తారు.



విశాఖపట్నం రైల్వేస్టేషన్

మరి ప్రయాణికుల ప్రాణ రక్షణ, భద్రత విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారా? అంటే లేదని సమాధానం వస్తుంది. తనిఖీలు కూడా పూర్తి స్థాయిలో చేయడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. దీంతో దొంగలు, నేరస్తులు, కిడ్నాపర్లు సులువుగా స్టేషన్ నుంచి తప్పించుకున్నారు.

లభ్యం కానీ బాలుడి ఆచూకీ

రైల్వేస్టేషన్‌లో గురువారం అపహరణకు గురైన చిన్నారి ఆచూకీ శుక్రవారం రాత్రి వరకు తెలియలేదు. చిన్నారి అపహరణతో మానసికంగా కుంగిపోయిన బాలుడి తల్లిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆమె బంధువులకు ఈ సమాచారం అందించారు. బాలుడి కోసం నగర పోలీసులకు కూడా సమాచారమిచ్చారు. వారితో సమన్వయం చేసుకుంటూ చిన్నారి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

ప్లాస్టిక్ విక్రేతలపై కొనసాగుతున్న దాడులు

58 దుకాణాలకు రూ.1.16 లక్షల జరిమానా



ప్లాస్టిక్ స్వాధీనం చేసుకున్న జీవీఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం

దాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు ఆధ్వర్యంలో నిషేధిత ప్లాస్టిక్ కలిగిన దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తనిఖీ చేసి.. యజమానుల నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తున్నాయి. ఈ మేరకు నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయిస్తున్న 58 దుకాణదారులపై శుక్రవారం దాడులు చేసి.. రూ.1,16,300 అపరాధ రుసుం విధించినట్లు అదనపు కమిషనర్ తెలిపారు. 130.31 కిలోల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నగర పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



'బాగున్నారా.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కిల్కారీ మొబైల్ సేవ నుంచి డాక్టర్ అనితను మాట్లాడుతున్నాను. బిడ్డ ఆరోగ్య సంరక్షణలో మీరు ఆచరించేందుకు సులువుగా ఉండే విషయాలు చెబుతా.. మనమంతా కలిసి మీ బిడ్డకు మెరుగైన భవిష్యత్తు అందిద్దాం'అంటూ గర్భిణులకు నాలుగో నెలలో వాయిస్ మెసేజ్ వస్తుంది.

బిడ్డ పుట్టిన తర్వాత 'నమస్కారం.. మీకు తెలుసా.. పుట్టిన గంటలోగా బిడ్డకు పాలు తాగించాలి. తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం. బిడ్డకు కావాల్సినవన్నీ వాటిలోనే ఉంటాయి'అని చెబుతూ గర్భిణులు, బాలింతల్లో అవగాహన పెంచుతున్నారు.

కిల్కారీ.. మహో ఉపకారి

- గర్భిణులు, బాలింతలకు కిల్కారీ ఫోన్‌కాల్స్
- మాత శిశు మరణాల నియంత్రణకు చర్యలు
- వారంలో 19 వేలమంది ఫోన్లకు వాయిస్ కాల్స్

సాక్షి, అనకాపల్లి : మాతా శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు 'కిల్కారీ'పేరిట వాయిస్ కాల్స్ అందించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ రూపకల్పన చేసింది. అనకాపల్లి జిల్లాలో మొత్తం 19,963 మంది గర్భిణులు ఉంటే.. వారిలో కనీసం 19 వేల మందికి కిల్కారీ సందేశాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు.

మార్చి నుంచి సేవలు

రాష్ట్రంలో ఈ ఏడాది మార్చి నుంచి కిల్కారీ సేవలు ప్రారంభం అయ్యాయి. ఇప్పటికే జిల్లాలో పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు కూడా శిక్షణ కల్పించారు. వీరి ద్వారా గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ వారం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారి మొబైళ్లకు వాయిస్‌కాల్ వస్తుంది. నాలుగు నెలలు నిండిన గర్భిణుల నుంచి బాలింతల వరకూ ప్రతీ ఒక్కరి మొబైల్‌కి వాయిస్ కాల్ వస్తుంది. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు 72 సార్లు వాయిస్ కాల్స్, మొబైల్ సందేశాలు వచ్చేలా కిల్కారీ కార్యక్రమానికి రూపకల్పన చేశారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

టోల్‌ఫ్రీ వాయిస్‌కాల్

సచివాలయ పరిధిలో గల ఏఎన్ఎం ఎప్పుడైతే రిజిష్టర్‌లో గర్భిణి వివరాలను నమోదు చేస్తారో.. తక్షణమే కిల్కారి సేవల్లో కూడా రిజిష్టర్ అయినట్టే. మూడో నెల గర్భవతిగా ఉన్నప్పటి నుంచే ఈ సేవలు ప్రారంభమవుతాయి. గర్భిణుల్లో తలెత్తే పలు సందేహాలను నివృత్తి చేసేలా ఈ వాయిస్ కాల్ సందేశం ఉంటుంది. గర్భిణులు, పాలిచ్చే తల్లుల మొబైళ్లకు డాక్టర్ అనిత అనే కల్పిత వైద్యురాలి వాయిస్‌తో ఆరోగ్యపరమైన సూచనలు, తీసుకోవాల్సిన పోషకాహారం, చేయించాల్సిన వైద్య పరీక్షలు వంటి అంశాలను వివరిస్తారు. ఈ వాయిస్ కాల్ సుమారు ఒకటిన్నర నిమిషం ఉంటుంది. గర్భిణులు ఫోన్ లిఫ్ట్ చేయకపోతే ఐవీఆర్ఎస్ విధానంలో ఆటోమెటిక్‌గా ఒకే రోజు మూడు సార్లు ఫోన్‌కాల్స్ వచ్చేలా చేస్తుంది. ఆ సందేశాలను మరోసారి వినాలనుకుంటే 14423 టోల్ ఫ్రీ నెంబరుకు డయల్ చేస్తే చాలు.



దశలవారీగా శిక్షణ

జిల్లాలో కిల్కారీ సేవలకు సంబంధించి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల పరిధిలో మెడికల్ ఆఫీసర్, సచివాలయ ఏఎన్ఎంల ద్వారా ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు కూడా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో దశల వారీగా శిక్షణ కల్పించారు. ప్రతీ నెల మొదటివారంలో ఒక రోజు ఆశ కార్యకర్తలకు ఈ సేవలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహారం, వాటి ద్వారా అందే పోషక విలువలపై అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా గర్భిణులకు వీడియో రూపంలో అవగాహన కల్పిస్తున్నారు. తల్లీ బిడ్డ ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కిల్కారీ వాయిస్ కాల్స్ తప్పక వినడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలిపేలా చర్యలు తీసుకుంటున్నారు.

మాతా శిశు మరణాలు తగ్గించేందుకే...



గర్భం దాల్చిన నుంచి పిల్లలు నడిచే వరకు గర్భిణులు, తల్లులు నిరంతరం బిజీ. వారి ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గుతుంది. అలాంటి వారి ఆరోగ్య పరిరక్షణకు కిల్కారీ దోహదపడతుంది. ఈ సేవల ద్వారా గ్రామాల్లో ఉండే ప్రతీ ఒక్కరిలో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నాం. వారంతట వారే పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని సంరక్షించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. మాతా శిశు మరణాలను పూర్తి స్థాయిలో తగ్గించేందుకే ప్రభుత్వం ఈ సేవలను తీసుకొచ్చింది. గర్భిణులు తమ సందేహాలను కూడా నివృత్తి చేసుకోవచ్చు.

– డాక్టర్ రేవతి, డీసీఎం

ఇంటి వద్దనే అవగాహన



అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ నెలా మొదటి వారంలో ఓ రోజు కిల్కారీ సేవలపై ఎలా కాల్ చేయాలి? వాయిస్ కాల్స్ ఎలా వస్తాయి? అనే వాటిపై శిక్షణ ఇస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలకు రాని, రాలేని గర్భిణులకు, బాలింతలకు నేరుగా వారి ఇంటికే వెళ్లి ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ కార్యకర్తల సహకారంతో అవగాహన కల్పిస్తున్నాం.

– ఎ.లక్ష్మి, ఏఎన్ఎం, గన్నవరం సచివాలయం, నాతవరం

క్లుప్తంగా

కోస్ట్‌గార్డ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఇండియన్ కోస్ట్‌గార్డ్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రధాన కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 120 మంది కోస్ట్‌గార్డ్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు రక్తదానం చేశారు.

నేడు వందేభారత్ రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖ-సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ శనివారం నాలుగు గంటలు ఆలస్యంగా బయల్దేరుతుంది. పలు నిర్వహణ పనుల నిమిత్తం శనివారం బయల్దేరవలసిన వందేభారత్‌ను రీషెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఉదయం 5.45గంటలకు బయల్దేరవలసిన విశాఖపట్నం-సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఉదయం 9.45గంటలకు విశాఖపట్నంలో బయల్దేరుతుందని అధికారులు తెలిపారు.

బంగ్లాదేశ్ వైపు వేట వద్దు : మత్స్యశాఖ జేడీ

మహారాణిపేట : బంగ్లాదేశ్‌లో ఈనెల 20వ తేదీ నుంచి జులై 23వ తేదీ వరకు సముద్రంలో చేపల వేట నిషేధం అమలులోఉందని, అందువల్ల జిల్లాకు చెందిన బోట్లు బంగ్లాదేశ్ సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లకూడదని జిల్లా మత్స్య శాఖ సంయుక్త సంచాలకురాలు జి.విజయ తెలిపారు. జిల్లాకు చెందిన ఏ బోట్లు బంగ్లాదేశ్ తీరం వైపు వెళ్లరాదని, నిబంధనలుఅతిక్రమించవద్దని ఆమె కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రావికమతం: మేడివాడ లో పేకాట శిబిరంపై శుక్రవారం దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని రావికమతం ఎస్ఐ ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు.మేడివాడ శివార్లులోని తోటల్లో పెద్ద ఎత్తున పేకాట ఆ డుతున్న ట్టు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. పలువురు పరారీకాగా ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ.1,230 నగదుస్వాధీనం చేసుకున్నామన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి



జాబ్ మేళాకు హాజరైన యువతీ, యువకులు

- మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేశారని తెలిపారు. అక్కడ ప్రత్యేక శిక్షణ ఇప్పించి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు మాట్లాడారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి చాముండేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 245 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్టు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా జిల్లాలో ఏదో ఒక నియోజకవర్గంలో జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నర్సీపట్నంలో 15 కంపెనీలతో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలో ఏడు స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేసి, వివిధ కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు వీటి ద్వారా శిక్షణ ఇచ్చి ప్రముఖ కంపెనీల్లో ఆకర్షణీయమైన జీతంతో ఉద్యోగాలు కల్పించినట్టు చెప్పారు. గత ఏడాది 2,063 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించామన్నారు. జాబ్‌మేళాలో 735 మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనగా, 262 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని చాముండేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకుడు యాదగిరి శేషు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, స్కిల్ హబ్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటోలో తోట

- ఆకట్టుకుంటున్న గ్రీన్ ఆటో
- ఆటో చుట్టూ పర్యావరణాన్ని కాంక్షిస్తూ మొక్కలు
- ఆటో లోపల గ్రీన్ గార్డెన్



గ్రీన్ (పర్యావరణ)ఆటో..



ఆటో లోపల గ్రీనరీ..



ఆటో సీలింగ్ కూడా గ్రీనరీయే..



ఆటో కార్మికుడు డేవిడ్

డాబాగార్డెన్స్ : ఇంటి పెరట్లోను.. మిద్దెలపైన మొక్కలు పెంచటం సహజం. అందుకు భిన్నంగా తన బతుకు బండి అయిన ఆటోను హరితవనంగా మార్చాడు. ఆటోలో ఎక్కే ప్రయాణికులకు ఇది ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. నగరంలో పర్యావరణ ఆటో విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రయాణికులెవరైనా సరే ఫొటోలు తీసుకుంటారు. సెల్ఫీలతో సందడి చేస్తారు. ఆ తర్వాత ఆటో ఎక్కి..ప్రయాణిస్తారు.

వివరాల్లోకి వెళ్తే..గాజువాక గణపతినగర్‌కు చెందిన ఎం.డేవిడ్ ఏడేళ్లుగా ఆటో నడుపుతున్నాడు. తన ఆటోను స్కూల్ పిల్లల కోసం అధునాతనంగా అలంకరించుకున్నాడు. వివిధ పాఠశాలల పిల్లలను తరచూ తీసుకెళ్తుంటాడు. ఎప్పుడైనా పాఠశాలలకు సెలవైతే..ఆ ఆటోను ప్రజల కోసం అందుబాటులోకి తెస్తుంటాడు. సాధారణ ఆటో చార్జీలే వసూలు చేస్తుంటాడు. ఆటోలో ముఖ్యంగా పచ్చదనం కనిపిస్తోంది. ఆటో చుట్టూ పూల మొక్కలు ఏర్పాటు చేశాడు. సీటు.. సీలింగ్‌తో పాటు మొత్తం ఆటో అంతా పచ్చదనంతోనే నింపాడు. ఆ ఆటోలో ప్రయాణిస్తుంటే..ఏసీలో ప్రయాణించినట్టు ఉంటుందని ప్రయాణికులు చెబుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకే..

నగరంలో కాలుష్యం పెరిగిపోతోంది. దీంతో వినూత్నంగా ఆటోను తీర్చిదిద్దాలనుకున్నా..పైగా పాఠశాలలకు పిల్లలను తీసుకువెళుతుంటా..ఈ క్రమంలో ఆటోను పర్యావరణహితంగా మార్చాలని భావించా..అందుకనుగుణంగా పచ్చదనంతో నింపేశా..ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు స్వచ్ఛమైన గాలితో పాటు ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆటో పైటాప్‌పై కూడా గార్డెన్ వేయనున్నట్టు తెలిపాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- కొత్త యర్రవరంలో ఘటన
- ఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ గఫూర్, ఎస్ఐ పాపినాయుడు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ షేక్ గఫూర్, ఎస్ఐ పాపినాయుడు

యలమంచిలి : మున్సిపాలిటీ పరిధి కొత్త యర్రవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు శుక్రవారం సాయంత్రం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. కొత్త యర్రవరం గ్రామానికి చెందిన సేనాపతి కామరాజు గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే తిరిగి ఇంటికి చేరుకోలేదు. శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దీనిపై సమాచారం అందడంతో సీఐ గఫూర్, ఎస్ఐ పాపినాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు భార్య రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.

చూచుకొండ బీటెక్ విద్యార్థికి బంగారు పతకం



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా గోల్డ్‌మెడల్,సర్టిఫికెట్ అందుకుంటున్న ఈశ్వరసాయి సీతారాము

మునగపాక: మండలంలోని చూచుకొండ గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి పెంటకోట ఈశ్వర సాయి సీతారాము అధిక మార్కులు సాధించి బంగారు పతకాన్ని అందుకున్నాడు. చూచుకొండ పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి పెంటకోట హరేరామ కుమారుడు ఈశ్వర సాయి సీతారాము గుంటూరులోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాలలో బీటెక్ (మెకానికల్) పూర్తి చేశాడు. ఫైనల్ పరీక్షల్లో పది పాయింట్లకుగాను 9.1 పాయింట్లు పొంది కళాశాల పరిధిలో గోల్డ్ మెడల్ సాధించాడు. గుంటూరులో శుక్రవారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా బంగారు పతకంతో పాటు సర్టిఫికెట్ అందుకున్నాడు. తమ గ్రామానికి చెందిన విద్యార్థి బంగారు పతకం సాధించడంతో చూచుకొండ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నిజాయితీపరులైప ఉద్యోగులే రైల్వేకు ఆస్తి

- డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): నీతి, నిజాయతీలతో పనిచేసే ఉద్యోగులే రైల్వేకు నిజమైన ఆస్తి అని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి పేర్కొన్నారు. అంకిత భావం ఉన్న ఉద్యోగులు సంస్థను తమదిగా భావించి పనిచేస్తారన్నారు. కొద్దిమంది మాత్రం వారి పనులు చేసుకోకుండా ఇతరులను తప్పుదోవ పట్టిస్తారని, ఇటువంటి సంఘటనలు వాల్తేర్ డివిజన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్నట్లు ఆయన తెలిపారు. వాల్తేర్ డివిజన్‌లో అసత్యాలు ప్రచారం చేసే వారిని, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే హాస్పటల్‌లో పనిచేస్తున్న వైద్యుడి విషయంలో జోనల్ రైల్వే అడ్మినిస్ట్రేషన్ నిబంధనలకు లోబడి బదిలీ చేసిందని, అయితే ఆ వైద్యుడు తప్పుడు నివేదికలను సమర్పించాడని, అనంతరం తాత్కాలిక స్టే తెచ్చుకున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ఈయన ఇటీవల మీడియా సమావేశాలు ఏర్పాటుచేసి అసత్యాలను ప్రచారం చేస్తున్నాడని... అవన్నీ అవాస్తవాలేనన్నారు.

హత్యాయత్నం చేసిన వ్యక్తికి జైలు

విశాఖ లీగల్: స్వల్ప వివాదంలో ఒకరిపై హత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నగరంలోని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి లాలం శ్రీధర్ శుక్రవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు అదనంగా రూ.1000 జరిమానా చెల్లించాలని లేని పక్షంలో మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వి.ఆర్.మూర్తి అందించిన వివరాలివీ.. ముద్దాయి బుద్ధ నరసింహమూర్తి ఉమ్మడి విశాఖ జిల్లా చీడికాడ మండలం తురువోలు గ్రామ నివాసి. వృత్తిరీత్యా వ్యవసాయదారుడు. బాధితుడు కొలగొట్ల చిన్న పైడయ్య కూడా అదే గ్రామానికి చెందిన వాడు. 2016 ఆగస్టు 31వ తేదీ ఉదయం 7 గంటల ప్రాంతంలో పైడయ్యకు చెందిన పాడి పశువులు నిందితుడు నరసింహమూర్తి పొలంలోకి వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. సంఘటనతో కోపోద్రిక్తుడైన నరసింహమూర్తి మరికొందరితో కలిసి సమీపంలోని కత్తితో పైడయ్యపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు చీడికాడ పోలీసులు నిందితులపై 307 కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. కేసులో ప్రధాన నిందితుడు చంటిబాబు చనిపోయాడు. రెండవ నిందితుడిపై నేరం రుజువైంది. మూడు, నాలుగు నిందితులపై కేసు రుజువు కాలేదు.

బాలుడిని హత్య చేశారా.. పాము కరిచిందా?

- అనుమానాస్పద మృతి కేసుగా నమోదు
- ఎస్ఆర్‌పురంలో ఘటన



బాలుడు తేజ(ఫైల్)

సింహాచలం: ఐదేళ్ల బాలుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. పెందుర్తి మండలం ఎస్ఆర్‌పురంలో జరిగిన ఈ ఘటన సంచలనం రేకెత్తించింది. ఇంటిలో నుంచి ఆడుకునేందుకు వెళ్లిన కొడుకు నిర్జీవంగా కనిపించడంతో ఆ తల్లిదండ్రులు విలపించిన తీరు అందరినీ కలచివేసింది. బాలుడిని ఎవరైనా హత్య చేశారా? లేదా పాము కాటుకు గురయ్యాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెందుర్తి మండలం ఎస్ఆర్‌పురంలో పల్లా కనకరాజు, నారాయణమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి కూతురు, కొడుకు తేజ(5) ఉన్నారు. కనకరాజు లారీ డ్రైవర్‌గా పని చేస్తుండగా నారాయణమ్మ గృహిణి. తేజ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఆడుకుంటుంటాడు. చుట్టు పక్కల వాళ్ల ఇంటికి కూడా వెళ్తుంటాడు. ఈ తరుణంలోనే గురువారం సాయంత్రం ఇంటి పరిసర ప్రాంతాల్లో ఆడుకునేందుకు వెళ్లాడు. రాత్రి అయినా ఎంతకీ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికారు. తేజ ఎక్కువగా ఎక్కడెక్కడికి వెళ్తుంటాడో ఆ ప్రదేశాల్లో వెతికినప్పటికీ.. చిన్నారి జాడ కనిపించలేదు. దీంతో రాత్రి 10 గంటల సమయంలో పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్ఆర్‌పురం వచ్చిన లా అండ్ ఆర్డర్ ఎస్ఐ అసిరితాత గ్రామస్తులతో కలిసి బాలుడి జాడకోసం వెతికారు. కానీ ఫలితం లేకపోయింది. కాగా.. శుక్రవారం ఉదయం ఇంటికి సమీపంలోనే లారీ షెడ్ పక్కన తేజ విగతజీవిగా ఉండటాన్ని గ్రామస్తులు, తల్లిదండ్రులు చూశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఇన్‌చార్జి సీఐ నరసింహారావు అక్కడ పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. తేజ మృతిపై అనుమానాలు తలెత్తడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఇదిలా ఉండగా తన కుమారుడిని ఎవరో చంపేశారని తేజ తల్లి నారాయణమ్మ ఆరోపించారు. జరిగిన ఘటనపై ఏసీపీ నరసింహ మూర్తి మాట్లాడుతూ తేజ నోటి వెంట నురగ వచ్చి ఉందని, చేతికి రెండు గాట్లు ఉన్నాయని, పాము కరిచి ఉండవచ్చనే అనుమానం ఉందన్నారు. లేదా తేజ కుటుంబంతో పడని వారెవరైనా గత కారణాలను దృష్టిలో ఉంచుకుని హత్య చేసి ఉంటారా అన్న అనుమానం కూడా కలుగుతోందన్నారు. పోస్టుమార్టం నివేదిక రాగానే అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తామని తెలిపారు. కాగా శుక్రవారం ఉదయం తేజ మృతదేహం కనిపించిన లారీ షెడ్ వద్ద.. గురువారం రాత్రి కూడా పోలీసులు, గ్రామస్తులు వెతికినట్లు చెబుతున్నారు. అప్పుడు కనిపించని తేజ మృతదేహం.. ఉదయానికి కనిపించడంతో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

వంద కిలోల గంజాయి పట్టివేత

- నలుగురు అరెస్టు, ఇద్దరు పరార్



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

మారేడుమిల్లి : ఆంధ్ర, ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి మహరాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న వంద కిలోల గంజాయిని మారేడుమిల్లి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన అకింత్ కేతన్ సవ్లా, అభిజిత్ గోవింత్ రాథ్, రుషికేష్ బాపురావ్, సాగర్ కొల్లి అనే వ్యక్తులు రెండు కార్లలో గంజాయితో వస్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు కూడురు గ్రామ శివారులో తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. వారి నుంచి 25 కిలోల చొప్పున నాలుగు బ్యాగ్‌లలోని వంద కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు మల్లికార్జున్, మదన్ పరారీలో ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. గంజాయి విలువ రూ.మూడు లక్షలు ఉంటుందన్నారు. రెండు కార్లు, నాలుగు సెల్ ఫోన్లలను సీజ్ చేశామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రాజన్న ఆశయాలు జగన్‌తోనే సాధ్యం

పెదబయలు: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధన ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. శుక్రవారం మండలంలోని మారుమూల గోమంగి గ్రామ పంచాయతీ రాయిమామిడి కూడలిలో సొంత నిధులతో ప్రజలు ఏర్పాటుచేసిన వైఎస్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. పంచాయతీ ప్రజలు సొంత నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాజన్న ఆశయాలకు తగ్గట్టుగానే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రైతుల పక్షపాతిగా వైఎస్ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యం దిశగా పాలన సాగిస్తూ సంక్షేమాన్ని ప్రజల ముంగిటకు తెచ్చారన్నారు. మారుమూల పంచాయతీలకు కేంద్రంగా ఉన్న గోమంగిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు.

12న ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

నర్సీపట్నం: బయపురెడ్డిపాలెంలో గల ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తుంచనున్నట్టు ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. ఈ మేళాకు 10 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలు రెండు సెట్లు, రెండు పాస్ ఫోటోలతో హాజరుకావాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సెప్టెంబర్ 9 నుంచి హిందీ పరీక్షలు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ(హైదరాబాద్) ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న మైనార్టీ విద్యార్థుల నుంచి పలు హిందీ పరీక్షల నిమిత్తం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.ఎ.రహీమ్ తెలిపారు. ఈ పరీక్షలు సెప్టెంబర్ 9 నుంచి మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే వారు ఆగస్టు రెండో తేదీలోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డీసెట్‌కు ఏర్పాట్లు

ఆరిలోవ: ఈనెల 12న జరగనున్న డీసెట్-2023కు ఏర్పాట్లు చేసినట్లు డీఈవో ఎల్.చంద్రకళ శుక్రవారం తెలిపారు. పూర్తిగా కంప్యూటర్ బేస్‌డ్ టెస్ట్ అయిన దీని కోసం పెందుర్తి ప్రాంతం చినముషిడివాడలో ఐయాన్ డిజిటల్ ఇన్‌స్టిట్యూట్‌లో కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

108లో సుఖ ప్రసవం



శిశువును ఆశా కార్యకర్తకు అందిస్తున్న 108 సిబ్బంది

మారేడుమిల్లి : ఆస్పత్రికి 108 వాహనంలో తరలిస్తుండగా ఓ గర్భిణి మగబిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని సున్నంపాడు శివారు నూరుపూడికి చెందిన గర్భిణి కె. శివానికి పురిటి నొప్పులు రావడంతో బంధువులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమెను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే ఆమెకు 108 ఈఎంటీ ఎం.వెంకట్, పైలెట్ పీవీబీ రెడ్డి పురుడు పోశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారి ఇరువురిని సమీపంలోని పెద్ద గెద్దాడ పీహెచ్‌సీ తరలించామని సిబ్బంది పేర్కొన్నారు.

క్లుప్తంగా

వేడి సెగలతో ఉక్కిరిబిక్కిరి

కశింకోట : మండలంలో వేసవి ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. గురువారం కంటే శుక్రవారం కాస్త తగ్గినట్టు గూగుల్లో చూపిస్తున్నా.. వడగాడ్పుల తీవ్రత కారణంగా ఉక్కబోత పెరిగింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు వేడి గాలులు కొనసాగాయి. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడ్డారు. రాత్రి అయినా ఉక్కపోత, వేడి సెగలు వీడలేదు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

అనకాపల్లి రూరల్ : అనకాపల్లి ఎంపీడీవోగా కేవీ నరసింహారావు శుక్రవారం విధుల్లో చేరారు. పాడేరు పరిపాలనాధికారిగా పనిచేస్తున్న నరసింహారావును పదోన్నతిపై ఉన్నతాధికారులు అనకాపల్లి ఎంపీడీవోగా నియమించారు. ఇప్పటివరకూ అనకాపల్లి మండల పరిషత్‌కు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ కె.ధర్మారావు వ్యవహరించారు. జిల్లా కేంద్రంలో కీలకమైన అనకాపల్లి ఎంపీడీవో కార్యాలయానికి పూర్తిస్థాయి ఎంపీడీవో అవసరమని గుర్తించిన అధికారులు ఇటీవల ఎంపీడీవోగా నరసింహారావును నియమించారు.

డీటీగా బాధ్యతలు స్వీకరించిన శాంతిభూషణ్

పరవాడ: పరవాడ డిప్యూటీ తహసీల్దారుగా డి.శాంతిభూషణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన యలమంచిలి ల్యాండ్ ఎక్విజిషన్ డీటీగా విధులు నిర్వహించి పరవాడ డీటీగా బదిలీపై వచ్చారు. ఈయనకు గతంలో పరవాడ ఆర్ఐగా పనిచేసిన అనుభవం ఉంది. ఇక్కడ గతంలో డీటీగా పనిచేసిన వరహాలు రోలుగుంట మండల డీటీగా బదిలీ అయ్యారు.

అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



దాత రాజుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పరవాడ: నాయుడుపాలెం దరి హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు రూ.10116 విరాళంగా ఆలయ నిర్వాహకులకు శుక్రవారం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను బురదరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కూండ్రపు సీతారామయ్య, ఈ.లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
అన్‌స్టాపబుల్	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 13 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	4,700	4,700
మూడోరకం	--	--

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-9 యూనిట్లు, బీ నెగిటివ్-2యూనిట్లు, ఓ పాజిటివ్-21 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి గంగయ్య(9182834480)ని సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 321 మంది వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 267 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ఖరీఫ్.. ప్రో‘సీడ్’



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

రాజు మంచివాడైతే రాజ్యం సుభిక్షంగా ఉంటుందన్నది నానుడి. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి నెలకు మూడు వర్షాలన్న రీతిలో వరుణుడు కరుణిస్తున్నాడు. దీంతో రైతన్నలు సాగునీటికి ఇబ్బందిపడ్డ దాఖలాల్లేవు. మరోవైపు క్రమం తప్పకుండా రైతు భరోసా పేరిట పెట్టుబడి సాయం, యంత్రపరికరాల పంపిణీ, ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు ఇలా అడుగడుగునా ప్రభుత్వ సాయంతో వ్యవసాయం పండగలా మారింది.

- పంటల ప్రణాళిక ఖరారు
- సాగుకు రైతులు సన్నద్ధం
- విత్తనాలు, ఎరువులు సిద్ధం

అనకాపల్లి రూరల్ : రైతన్నలు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది ఏప్రిల్‌లోనే వర్షాలు కురిశాయి. ఇపుడూ అడపాదడపా కురుస్తున్నాయి. దీంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు వీలుగా రైతులు తమ కమతాలను దుక్కిదున్ని సన్నద్ధం చేస్తున్నారు.

ప్రభుత్వ సాయం పుష్కలం

మరోవైపు సేద్యానికి ప్రభుత్వం కూడా అన్ని విధాలా రైతులకు దన్నుగా నిలుస్తోంది. ఇప్పటికే ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా సొమ్మును రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. ఇటీవల వ్యవసాయానికి అవసరమైన యంత్ర పరికరాలను కూడా ప్రభుత్వం రైతులకు అందజేసింది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి కర్షకులకు అవసరమైన విత్తనం మొదలు పంట దిగుబడుల విక్రయం వరకూ ఏ ఇబ్బందీ లేకుండా అండగా నిలుస్తోంది. త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ పంటల ప్రణాళికను వ్యవసాయశాఖ ఇప్పటికే సిద్ధం చేసింది. వ్యవసాయాధికారులు విత్తనాలు, ఎరువులు ఎంత అవసరమో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీనికి అనుగుణంగా కొరత లేకుండా విత్తనాలు, ఎరువులను ముందస్తుగా ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీతో ఆర్బీకేల ద్వారా రైతులకు అందిస్తోంది. పచ్చిరొట్ట ఏపుగా ఎగడంతో దుక్కిలో కలిపేందుకు రైతులు సిద్ధమయ్యారు.



తుమ్మపాల ఆర్బీకేలో నిల్వ చేసిన వరి విత్తనాలు

వరి విత్తనాలు సిద్ధం

2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అనకాపల్లి మండలంలో గతంలో రైతులు సాగు చేసిన పంటల విస్తీర్ణం ఆధారంగా అన్ని రకాల వరి విత్తనాలు 1096.4 క్వింటాళ్లు అవసరమని తేలింది. ఈ మేరకు అధికారుల నివేదిక ఆధారంగా విత్తనాలను రైతు భరోసా కేంద్రాలకు పంపించారు. వీటిలో ఆర్‌జీఎల్ రకం వరి విత్తనాలే అధికం. దాదాపు 857 క్వింటాళ్ల ఆర్‌జీఎల్-2537 రకం కాగా, మిగిలిన విత్తనాల్లో బీపీటీ-3291, ఎంటీయూ-1224 రకాలున్నాయి. త్వరలోనే విత్తన పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. వర్షాలు పడిన వెంటనే విత్తుకునేందుకు వీలుగా రైతు చెంతకు విత్తనాలను చేర్చనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇక భూసారం పెంచే పచ్చిరొట్ట విత్తనాలను సైతం రైతులకు ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. 50 శాతం రాయితీతో విత్తనాలు అందించేందుకు 30.42 క్వింటాళ్లు సిద్ధం చేశారు. ప్రభుత్వ ప్రణాళిక మేరకు ఎరువులను కూడా రైతులకు సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఆర్బీకేలతో పాటుగా టోకు వర్తకులు, చిల్లర వర్తకులు, మార్క్‌ఫెడ్, సహకార సంఘాల్లో కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంటాయి.

పొలాన్ని సిద్ధం చేశాను



నా పంట పొలాన్ని దుక్కి దున్ని సాగుకోసం సిద్ధం చేశా. మా గ్రామంతోపాటుగా చుట్టుపక్కల వరి సాగు చేసే రైతులు కూడా పొలాలను విత్తు కునేందుకు వీలుగా తయారు చేసే పనిలో ఉన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి సాయం కూడా నా బ్యాంకు ఖాతాలో జమ అవుతోంది. రైతు భరోసా కేంద్రం ద్వారా వ్యవసాయానికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలు అందుతున్నాయి.

– సుంకర కోటేశ్వరరావు, రైతు, మార్టూరు

ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం



ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నాం. విత్తనాలు, ఎరువుల కేటాయింపులకు సంబంధించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. ఆ మేరకు వరి విత్తనాలు ఇప్పటికే ఆర్బీకేలకు చేరాయి. విత్తనాల సరఫరా కూడా ప్రారంభమైంది. విత్తనాలన్నీ ఆర్బీకేలలో నిల్వ చేశాం. రైతులు ఆర్బీకేల ద్వారా అవసరమైనపుడు విత్తనాలు పొందవచ్చు. వరి నాట్లు వేసిన వెంటనే రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేస్తాం.

– పీయూబీపీ రంగాచారి, ఏవో, అనకాపల్లి

డైట్ కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరణ



డైట్ కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరిస్తున్న హేమచంద్రారెడ్డి

అనకాపల్లిటౌన్ : స్థానిక డైట్ కళాశాల మ్యాగజైన్(2023-24)ను స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి శుక్రవారం మంగళగిరిలోని వారి కార్యాలయంలో ప్రారంభించినట్టు కళాశాల యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం విద్యావ్యవస్థలో అనేక రకాలైన మార్పులు తీసుకువచ్చిందన్నారు. కళాశాల యాజమాన్యాలు కూడా తమ వంతు బాధ్యతగా విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడంపై అధ్యాపకులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, వివిధ కళాశాలల చైర్మన్లు పాల్గొన్నారు.

శంకరం-అనకాపల్లి రోడ్డు పునరుద్ధరణ



యంత్రాలతో శంకరం నుంచి అనకాపల్లి రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

తుమ్మపాల : శంకరం నుంచి అనకాపల్లి పట్టణంలోకి వెళ్లే రోడ్డు అభివృద్ధి పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్ జంక్షన్ నుంచి నేరుగా పొలాల మధ్యలో ఆరు లైన్ల రహదారిని నిర్మించి, సబ్బవరం వైపు శంకరం వద్ద రోడ్డుకు అనుసంధానించారు. దీంతో విజయవాడ నుంచి కోల్‌కతా వైపు రాకపోకలు సాగించే వాహనాలు పట్టణంలోకి రాకుండా నేరుగా నూతన రహదారి మీదుగా వెళ్తున్నాయి. టౌన్‌కు రావాలంటే మాత్రం శంకరం నుంచి రైల్వే వంతెన మీదుగా ఉన్న రోడ్డే ఆధారం. అయితే ఈ రోడ్డు చాలా కాలంగా మరమత్తులకు గురైంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా గోతులమయం కావడంతో ఇటుగా రాకపోకలు చేసే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. దీంతో అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి నడుంబిగించారు. ప్రస్తుతం గోతులతో ఉన్న లేయర్‌ను తొలగించి పటిష్టంగా ఉండేలా నూతన రోడ్డు నిర్మాణానికి సిద్ధమయ్యారు. అబ్కారీ శాఖ గొడౌన్ సమీపంలో పనులు జరుగుతున్నాయి.

త్వరితగతిన జగనన్న గృహ నిర్మాణాలు

- లబ్ధిదారులకు ప్రత్యేకాధికారి రోజారాణి సూచన



ఉగ్గినపాలెంలో వైఎస్సార్ జగనన్న కాలనీని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి రోజారాణి

కశింకోట : వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి రోజారాణి లబ్ధిదారులను కోరారు. మండలంలోని ఉగ్గినపాలెంలో జగనన్న కాలనీని శుక్రవారం సందర్శించారు. గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించని వారు తక్షణమే ప్రారంభించాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. వేసవి దృష్ట్యా ఉదయం వేగంగా పనులకు రావాలని, వేసవి తాపానికి గురి కాకుండా ఇళ్లకు చేరుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి అక్కడ జగనన్న గోరు ముద్ద మెనూ అమలు తీరును పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, హౌసింగ్ ఏఈ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

‘ఆకతాయిల చర్యలను అరికట్టండి’



ఎస్ఐ దివాకర్‌యాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అనకాపల్లిటౌన్ : పట్టణ పరిధిలో రాత్రి సమయంలో వీధి లైట్లు ఆర్పేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్నియాదవ్ కోరారు. ఈ మేరకు ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణ ఎస్ఐ దివాకర్‌యాదవ్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. మందుబాబులు రాత్రి సుమారు 9 గంటల సమయంలో వీధి లైట్లు స్విచాఫ్ చేస్తుండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వీధిలైట్లు ఆఫ్ చేశాక బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ నానా యాగీ చేస్తున్నారని విన్నవించారు. వినతి పత్రం అందించిన వారిలో ఐక్యవేదిక సభ్యులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజులు, పిట్ట సూర్యారావు తదితరులున్నారు.

సీసీ కాలువ పనులకు శ్రీకారం



సీసీ కాల్వ పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దిలీప్ కుమార్

అనకాపల్లి రూరల్ : రాష్ట్రంలో వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ అన్నారు. శుక్రవారం తుమ్మపాల మేజర్ పంచాయతీ గవరపేటలోని కొబ్బరితోటవీధిలో రూ.6 లక్షలతో చేపట్టనున్న సీసీ కాలువ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ గ్రామాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా మేనిఫెస్టో హామీలను 99 శాతానికి పైగా అమలు చేస్తున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైస్ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్ర శేఖర్, ఎంపీటీసీలు పన్నీరు వెంకటలక్ష్మి, చంటి, దంతులూరి కల్యాణ్ చక్రవర్తి, ఉపసర్పంచ్ చదరం చిన్నా, జిల్లా బీఎస్ఎన్ఎల్ సలహా కమిటీ సభ్యుడు పీలా విశ్వేశ్వరరావు, రైతు సంఘాల నాయకుడు పీలా బుజ్జి, వార్డు సభ్యులు వెలగా మోదునాయుడు, రవ్వ శ్రీను, మాదిబోయిన నాగరాజు, తర సత్యారావు, రామారావు, కొణతాల అర్జున్ నాయుడు, లహరి, గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



సబ్బవరం లా యూనివర్సిటీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ రంగనాథం, సిబ్బంది

సబ్బవరం: మండలంలోని పలు చోట్ల సీఐ రంగనాథం ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని పలు ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేశారు. మందు బాబులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. హెల్మెట్‌ధారణతో పాటు రోడ్డు ప్రమాదాలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో కోడి పందాలు, గుళ్లాటలు, పేకాట, మద్యం, గంజాయి అక్రమ రవాణాపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలకు దిశ యాప్, పోక్సో చట్టం, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు అల్లు వెంకటేశ్వరరావు, ఎల్. సురేష్, సిబ్బంది సాయి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరవాడ తహసీల్దారుగా కనకారావు

పరవాడ: పరవాడ తహసీల్దారుగా పి.కనకారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో నాతవరం మండల తహసీల్దారుగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో పరవాడ తహసీల్దారుగా పనిచేసిన వి.ప్రకాశరావు మునకపాక తహసీల్దారుగా బదిలీ అయ్యారు. తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన కనకారావుకు రెవెన్యూ కార్యాలయ డీటీ శాంతిభూషణ్, ఆర్ఐ శ్రీలేఖ, సీనియర్ అసిస్టెంటు, వీఆర్వోలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌కు రూ. 10 వేల జరిమానా

పరవాడ: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌తనిఖీల్లో పట్టుబడిన వారికి ఇకపై రూ.10 వేల జరిమానా లేదా వారం రోజులు జైలు శిక్ష విధించబడుతుందని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

హెచ్‌ఎంకు అభినందన సత్కారం



హెచ్‌ఎం శంకరరావును అభినందిస్తున్న తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు

అనకాపల్లి రూరల్ : తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా శంకరరావు శుక్రవారం విధుల్లో చేరారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. కొండకర్ల జెడ్పీ హైస్కూల్ నుంచి తాజా బదిలీల్లో ఆయన ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంను సర్పంచ్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. తుమ్మపాల హైస్కూల్‌కు జిల్లాలో మంచి పేరుందని, దాన్ని మరింతగా పెంచేలా కృషి చేయాలని సూచించారు. సీఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. పంచాయతీ నుంచి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లకు మద్దతుగా నిరసన



బస్ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలుపుతున్న వికలాంగుల హక్కుల వేదిక ప్రతినిధులు

అనకాపల్లి రూరల్ : మహిళా రెజ్లర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ప్రతినిధులు శుక్రవారం నిరసన తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సంఘం ప్రతినిధులు బీజేపీ ఎంపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పేరు ప్రఖ్యాతులు తెస్తున్న మహిళా రెజ్లర్లపై బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎంపీ అసభ్యకరంగా ప్రవర్తించడం దురదృష్టకరమన్నారు. న్యాయం కోసం ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళా రెజ్లర్లపై ఎదురు కేసులు పెట్టి వేధించడం తగదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు బుద్ధ ధనలక్ష్మి, ప్రతినిధులు ఆడారి అన్నపూర్ణ, కె.రామలక్ష్మి, బండా లక్ష్మి, సన్యాసమ్మ, రాపేటి భాస్కరరావు, పెట్ల సన్యాసిరావు, హాసిని పాల్గొన్నారు.

శిక్షణతో మెరుగైన బోధన



శిక్షణలో మాట్లాడుతున్న మాణిక్యాలరావు

అనకాపల్లిటౌన్ : ఉపాధ్యాయులు శిక్షణ ద్వారా బోధనలో మెలకువలను నేర్చుకుని, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించగలరని భీమిలి డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు తెలిపారు. స్థానిక జీఎంజీ స్కూల్లో గత నెల 29 నుంచి జరుగుతున్న డీఎస్సీ ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంతగా ప్రస్తుత ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. దీన్ని వినియోగించుకుని విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థులను అర్థం చేసుకుంటూ, బోధన కొనసాగించాలని వివరించారు. బోధనలో మెలకువల్ని తెలిపారు. శిక్షణలో కోర్స్ డైరెక్టర్ గొడ్డేటి రవి, రిసోర్స్‌పర్సన్లు, కొయ్యూరు, చింతపల్లి, జీకే వీధి, నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం, రోలుగుంట, కోటవురట్ల మండలాలకు చెందిన 1998, 2008, 2018 డీఎస్సీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యల్లయ్య కాలువలో పూడిక తొలగింపు



రావుగోపాలరావు కళాక్షేత్రం వద్ద జేసీబీతో పూడికతీత పనులు

అనకాపల్లిటౌన్ : పట్టణం మీదుగా ప్రవహిస్తున్న యల్లయ్య కాలువలో పూడికతీత పనులు మొదలయ్యాయి. దీంతో కాలువ కింద పంటలు సాగుచేసే రైతుల్లో ఆశలు చిగురించాయి. ఏటా కాలువ పూడుకుపోయి, ఖరీఫ్ సీజన్లో సాగునీటి సరఫరాకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పూడిక తొలగింపుపై పలుమార్లు జీవీఎంసీ అధికారులకు మొరపెట్టుకున్నారు. స్పందించిన జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు పూడిక తొలగింపు పనులు ప్రారంభించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ఇదే కాలువ పట్టణవాసుల ఇళ్ల నుంచి వచ్చే మురుగునీటి ప్రవాహానికి ఆధారం. ఏళ్ల తరబడి పూడిక తొలగించక, దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తాజా పనులకు వీటన్నింటికి చెక్ పడటంతోపాటు, రైతుల ఇక్కట్లు కూడా తీరనున్నట్టు అధికారులు చెప్తున్నారు. పనుల పర్యవేక్షణ బాధ్యతల్ని జీవీఎంసీ చిత్తశుద్ధితో నిర్వహించి, పూర్తి స్థాయిలో పూడిక తొలగించేందుకు కృషి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్మాణాల పరిశీలన

సబ్బవరం: హౌసింగ్ డేలో భాగంగా మండలంలోని పలు లేఔట్లు, ప్రభుత్వ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమారి శుక్రవారం పరిశీలించారు.పైడివాడ అగ్రహారం లేవుట్‌ను సందర్శించి గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని, అమృతపురంలో నాడు-నేడులో భాగంగా చేపట్టిన పాఠశాల ఆధునికీకరణ పనులను తనిఖీ చేశారు. బాటజంగాలపాలెంలో ఉపాధి పథకంలో భాగంగా చేపట్టిన అమృత సరోవర్ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. సబ్బవరం పీహెచ్‌సీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ఎస్. బాబురావు, మండల విద్యాశాఖాధికారి ఎస్.అప్పలరాజు, హౌసింగ్ ఏఈ శేఖర్, సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి చక్రవర్తి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డా.. పార్కింగ్ స్థలమా?



ఎన్టీఆర్ వైద్యాలయం రహదారికి ఇరువైపులా నిలిపిన ప్రైవేట్ వాహనాలు

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని ప్రధాన రోడ్లలో ఇరువైపులా నిబంధనల్ని ఉల్లంఘించి వాహనాలు నిలిపి ట్రాఫిక్ ఇక్కట్లకు గురి చేస్తున్నారు. వీరిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేయడంతో ఆస్పత్రికి వెళ్లే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకేసారి ఎదురెదురుగా రెండు కార్లు వస్తే గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కున్నట్టే. వైద్యాల అంబులెన్స్‌ల రాకపోకలకు అడ్డంగా ప్రైవేట్ అంబులెన్స్‌లు నిలిపేస్తున్నారు. ఆస్పత్రి రోడ్డులో ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్న వాహనదారులపై చర్యలు తీసుకుని, ట్రాఫిక్ ఇక్కట్లు తొలగించాలని రోగుల బంధువులు కోరుతున్నారు.